# నమస్తే తెలంగాణ
## మహబూబ్‌నగర్
## నారాయణపేట
5 మహబూబ్‌నగర్, మంగళవారం 17 డిసెంబర్ 2024 MAHABUBNAGAR NARAYANPET




ధర తగ్గిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

# కంది ధర పెంచివ్వాల్సిందే..

- నారాయణపేటలో రైతుల ఆందోళన
- రెండ్రోజుల్లోనే రూ.2 వేలు తగ్గడంపై ఆగ్రహం
- వ్యాపారులు సిండికేటుగా మారారంటూ ఆరోపణ
- మార్కెట్ వ్యాపారులతో జరిగిన చర్చలు విఫలం

నారాయణపేట, డిసెంబర్ 16 : ధర తగ్గిందంటూ రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు ఎర్రకందులు 6,193 క్వింటాళ్లు (3,031 బ్యాగులు), నల్లకందులు 8 క్వింటాళ్లు (4 బ్యాగులు), తెల్లకందులు 1,585 క్వింటాళ్లు (770) బ్యాగులు.. మొత్తం 7,786 క్వింటాళ్లు.. 3,805 బ్యాగులు విక్రయానికి కర్షకులు తీసుకొచ్చారు. రెండ్రోజుల వ్యవధిలోనే కంది క్వింటాకు రూ.2 వేలు ధర పడిపోయిందన్న విషయాన్ని తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి స్పందించి వ్యాపారస్తులతో కలిసి చర్చించి సమస్య పరిష్కరించుకుందామని సూచించడంతో రైతులు శాంతించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, కార్యాలయ అధికారులు బీకేఎస్ నాయకులు వెంకోబా, అనంతరెడ్డి, సీపీఎం నాయకులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రాం, రైతు సంఘం నాయకులు అంజిలయ్యగౌడ్ తదితరులతో చర్చలు జరిపారు. అయితే పై నుంచి ధరలు తగ్గడం వల్లనే శని, సోమవారాల్లో వచ్చిన ధరల్లో వ్యత్యాసం వచ్చిందని అధికారులు తెలిపారు. ఒక్కో రైతుకు ఒక్కో ధర కేటాయించారని, పొంతన లేకుండా ధరలు కేటాయించి తమను తీవ్రంగా నష్టపరుస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించారని రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

### రైతులను మోసం చేయడమే..



నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఆరుగాలం కష్టపడి కంది పంటను పండించాను. కందులను విక్రయించేందుకు సోమవారం పేట మార్కెట్ యార్డుకు వచ్చాను. మార్కెట్‌లో శనివారం ఉన్న ధర సోమవారం లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. శనివారం ఎర్రకందులు గరిష్ఠంగా రూ.10,500 పలుకగా తెల్లకందులు రూ.11,500 పలికాయి. కానీ శనివారానికి సోమవారానికి రూ.2వేలు తగ్గించారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలి. పొద్దుగాల ఒక గంట ఆలస్యమైతే టెండర్లు తీసుకోరు. కానీ ఈ రోజు నాలుగు గంటల వరకు రైతులను వేచి ఉంచడం ఎంతవరకు సమంజసం.

*- నరేందర్, రైతు, కందెన్‌పల్లి, దామరగిద్ద*

### ధర తగ్గడంలో ఎన్నో అనుమానాలు..



నా పొలంలో పండిన 3 ప్యాకెట్ల కందులను విక్రయించేందుకు 60 కిలోమీటర్ల దూరం నుంచి పేట మార్కెట్ వచ్చాను. శనివారం మార్కెట్‌లో కందుల ధర రూ.10,500 నుంచి రూ.11,500 వరకు పలికింది. సోమవారం మాత్రం రూ.2వేలకు పైగా తగ్గించారు. ఒకే రోజు రూ.2వేలు తగ్గడం ఎన్నో అనుమానాలకు తావిస్తుంది. ధర తగ్గడంలో దళారుల పాత్ర కంటే మార్కెట్ అధికారులపాత్ర ఎక్కువగా ఉన్నట్లు స్పష్టం అవుతుంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పూర్తి కావల్సిన టెండర్లు సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగించడం ఎంతవరకు సరైంది. అసలే చలికాలం తాము పంటలను విక్రయించుకొని చలిలో ఊర్లకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది.

*- రమేశ్‌నాయక్, రైతు, దౌల్తాబాద్*

### కుదరని ఏకాభిప్రాయం..

శని, సోమవారానికి ధరల వ్యత్యాసంతో క్వింటా కందుల వెంట రూ.2 వేల ధర తగ్గడంతో ఆందోళకు దిగిన రైతుల తరపున రైతు, కార్మిక సంఘాల నాయకులు మార్కెట్ అధికారులు, వ్యాపారులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. సోమవారం టెండర్‌లో పలికిన ధరలకు రూ.500 పెంచి ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేయగా.. రూ.100 వరకే పెంచుతామని వ్యాపారులు చెప్పడంతో రైతు సంఘాల నాయకులు అంగీకరించకపోవడంతోపాటు చర్చల నుంచి వెనుదిరిగారు.



చర్లపల్లి జైలు వద్ద మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# లగచర్ల బాధితులను విడుదల చేయాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నారాయణపేట, డిసెంబర్ 16 : లగచర్ల బాధితులపై ప్రభుత్వం నమోదు చేసిన కేసులను వెనక్కి తీసుకొని వారిని వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి చర్లపల్లి జైలులో ఉన్న లగచర్ల, రోటిబండతండా, హకీంపేట, పులిచర్ల, దుద్యాల, పోలేపల్లి గ్రామాలకు చెందిన రైతులు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కలిసి పరామర్శించి ధైర్యంగా ఉండాలని, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని రైతులకు మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం విలేకరులతో మాజీ మంత్రి మాట్లాడుతూ రైతులను అరెస్టు చేసి నెల రోజులు అవుతున్నా ఇప్పటి వరకు చార్జ్‌షీట్ వేయకుండా కాలయాపన చేయడం చూస్తుంటే కావాలనే బెయిల్ రాకుండా పోలీసులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఒక మెట్టు దిగి వచ్చి ఫార్మా సెజ్ ఏర్పాటు నుంచి వెనక్కి తగ్గిందన్నారు. రద్దు చేసిన ఫార్మా స్థానంలో ఇండస్ట్రీస్ పేరుతో మరో మారు రైతులను అన్యాయానికి గురి చేయాలని చూస్తే బీఆర్‌ఎస్ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఆ ఆరు గ్రామాల రైతులకు అండగా నిలుస్తామని ప్రకటించారు.

# హామీల అమలులో సీఎం ఫెయిల్యూర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతున్నారు..
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, డిసెంబర్ 16 : హామీలు అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ అయ్యారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలం గడుపుతూ ప్రజలను మభ్యపెడుతుందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క గ్యారెంటీ సక్రమంగా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు దవాఖానల పాలవుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో పూర్తైన ఇండ్లకు కాంగ్రెస్ రంగులు వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, ఉపసర్పంచ్ నిరంజన్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు యాదగిరి, లింగం, పోలె అశోక్, శ్రీను, వెంకటయ్య, రాజు తదితరులు ఉన్నారు.

# జూలపల్లి-నంచర్ల రోడ్డు వేయాలి




జూలపల్లి నుంచి పాదయాత్ర చేపట్టిన గ్రామస్తులు

- గ్రామస్తుల పాదయాత్ర

మహ్మదాబాద్, డిసెంబర్ 16 : జూలపల్లి నుంచి నంచర్ల గేటు వరకు తారు రోడ్డు వేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామం నుంచి నంచర్ల గేటు వరకు రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంచర్ల గేటు నుంచి జూలపల్లి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. అత్యవసర సమయాల్లోనూ, గర్భిణులను దవాఖానకు తీసుకుపోయే సమయాల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రోడ్డు వేయించాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, త్వరలో సీఎంను కలిసి వినతిపత్రం అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, బాల్‌రెడ్డి, రాజు, పాండునాయక్, హరిచంద్రనాయక్, నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల సమస్యలు తలెత్తనీయొద్దు

- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ



వివరాలు తెలుసుకుంటున్న ఐజీ సత్యనాయణ

జడ్చర్ల, డిసెంబర్ 16 : జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను సోమవారం మల్టీజోన్-2 ఐజీ సత్యనాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలు సీఐ ఆదిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, ఫిర్యాదు దారులందరికీ ఒకే రకమైన సేవలు అందించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకొని శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో అధికంగా కేసులు నమోదవుతున్నాయని, కావున సిబ్బంది ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక నేరాల్లో పాల్గొన్న నేరస్తులపై హిస్టరీ షీట్స్ తెరిచి వారిపై నిఘా ఉంచాలని సూచించారు. జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు జాతీయ రహదారులు ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 167 ఉన్నందునా ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. విధులతోపాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ సీఐ ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

## వినూత్న రీతిలో..

సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. సోమవారం 7వ రోజు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని పలు జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణపేటలో చెవిలో పూలు పెట్టుకొని సమ్మెలో పాల్గొనగా.. గద్వాలలో మోకాళ్లపై కూర్చోగా.. వనపర్తిలో చంటిపిల్లలను లాలిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ విభాగాలలో పనిచేస్తున్న తమను విద్యాశాఖలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పలువురు డిమాండ్ చేశారు.

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 16*




మహబూబ్‌నగర్‌లో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు



గద్వాలలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## అధికారుల అలసత్వం
# పేదలకు శాపం

- యన్మన్‌గండ్లలో 130 ప్రజాపాలన దరఖాస్తులు బుట్టదాఖలు
- అర్హులున్నా అందని ప్రభుత్వ పథకాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు

నవాబ్‌పేట, డిసెంబర్ 16 : అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం.. కొంత మంది నిరుపేద లబ్ధిదారులకు శాపంగా మారింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనర్హులుగా మారారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మండలంలోని యన్మన్‌గండ్లలో గత ఏడాది డిసెంబర్ నెలలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని 710 మంది ఇంటి యజమానులు వివిధ పథకాల లబ్ధి కోసం ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్నారు. కాగా అప్పట్లో పంచాయతీ కార్యదర్శులతోపాటు కొంత మంది ఆపరేటర్లతో అధికారులు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించారు. కాగా యన్మన్‌గండ్ల గ్రామ పంచాయతీకి చెందిన దరఖాస్తులను సైతం మండల కేంద్రంలో ఆన్‌లైన్ చేయించారు. పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయి అధికారులు ఉదాసీనత కారణంగా సుమారుగా 130 దరఖాస్తులు బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం 562 దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపుతున్నాయి. మిగిలిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చూపడం లేదు. గత కొంత కాలం నుంచి ఆన్‌లైన్ కాని లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. కరెంటు బిల్లుల మాఫీ, వంట గ్యాస్ లబ్ధి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు నిరాశే మిగిలింది. కాగా ఇటీవలే అధికారులు గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే నిర్వహించారు. అధికారులు నిరుపేదల ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నప్పుడు వారి వివరాలు ఆన్‌లైన్ రావడం లేదని అధికారులు చెప్పడంతో నిరుపేదలు నివ్వెరపోతున్నారు. మీ ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్‌లో చూపడం లేదని దాటవేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. తాము గత ఏడాది కిందటే ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్నామని.. దరఖాస్తుకు సంబంధించిన రశీదు చూయిస్తుండడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మీ దరఖాస్తు ఆన్‌లైన్ కావడం లేదని అధికారులు చెబుతుండడంతో ఏమి చేయాలో తోచక బావురుమంటున్నారు. ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పిస్తే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సుష్మభారతిని వివరణ కోరగా కొన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ కాని విషయం వాస్తవమేనని చెప్పారు. ఆ దరఖాస్తుల కోసం గతంలో ఎంత వెతికినా లభించలేదన్నారు. మండల అధికారులను అడిగినా స్పందన లేదని చెప్పారు.

# ముగిసిన గ్రూప్-2 పరీక్ష



నారాయణపేటలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

- రెండో రోజు పరీక్ష ప్రశాంతం
- కేంద్రాలను తనిఖీ చేసిన ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గ్రూప్-2 పరీక్షలు సోమవారంతో ముగిశాయి. రెండో రోజు పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. పరీక్షా కేంద్రాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు పరిశీలించారు. వనపర్తి జిల్లాలో 31 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. పేపర్ 3కు 8,669 మందికి గానూ 4,382 మంది, పేపర్-4కు 4,281 మంది హాజరయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 25 కేంద్రాల్లో 8,722 మందికి గానూ పేపర్-3, పేపర్-4కు 48 శాతం హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 20,584 మందికి 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా రెండు సెషన్స్‌లో కలిసి 50 శాతానికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. నారాయణపేట జిల్లాలో 3,994 మందికిగానూ 13 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం 2,015.., మధ్యాహ్నం 2,016 మంది పరీక్ష రాశారు. నాగర్‌కర్నూల్‌జిల్లాలోని 32 పరీక్షా కేంద్రాల్లో 9,731 మందికి గానూ పేపర్-3, పేపర్-4కు 4699 మంది అభ్యర్థులు హాజరు కాగా 5032 మంది గైర్హాజరు కాగా 48శాతం హాజరుశాతం నమోదైనట్లు నిర్వాహకులు వెల్లడించారు.

*- నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, డిసెంబర్ 16*



మహబూబ్‌నగర్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు



కొత్తకోటలోని కేంద్రంలో పరీక్ష పేపర్ల బాక్స్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

# పాలమూరు శుభారంభం

- హెచ్‌సీఏ అండర్-14 క్రికెట్ టోర్నీలో సెయింట్ ఆంటోని జట్టుపై గెలుపు
- డబుల్ సెంచరీతో సత్తా చాటిన కేతన్

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 16 : హైదరాబాద్‌లో సోమవారం నుంచి ప్రారంభమైన హెచ్‌సీఏ అండర్-14 స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాలమూరు జట్టు శుభారంభం చేసింది. మొయినాబాద్‌లోని వన్ చాంపియన్‌షిప్ గ్రౌండ్-2లో హైదరాబాద్‌లోని సెయింట్ ఆంటోని స్కూల్ జట్టుతో జరిగిన మొదటి మ్యాచ్‌లో జిల్లా జట్టు 445 పరుగుల తేడాతో గెలుపొందింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 47 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 468 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ గున్న కేతన్ కుమార్ యాదవ్ 136 బంతుల్లో 26 ఫోర్స్, సిక్సర్ సాయంతో 235 పరుగులతో నాటౌట్‌గా నిలిచి సత్తా చాటాడు. అలాగే మిగితా క్రీడాకారులు శ్రీహర్షిత్ 75 నాటౌట్, ఆకారం హర్షిత్ 62, సాయిరాం 32, మాలిమ్ అర్హాన్ 30 రాణించగా.. 34 పరుగులు ఎక్స్‌ట్రా రూపంలో వచ్చాయి. 469 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సెయింట్ ఆంటోనీ జట్టు మహబూబ్‌నగర్ జట్టు బౌలర్ల ధాటికి కుప్పకూలింది. 11.1 ఓవర్లలో కేవలం 23 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. ఇందులో 8 పరుగులు ఎక్స్‌ట్రా రూపంలో వచ్చాయి. జిల్లా జట్టు బౌలర్లు సోహెల్ 7, వెంకట్‌సాగర్ 3 వికెట్లు తీశారు. కాగా మహబూబ్‌నగర్ జిల్లా చర్లపల్లికి చెందిన కేతన్ జడ్చర్ల స్వామినారాయణ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. డబుల్ సెంచరీతో మెరిసిన క్రీడాకారుడిని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా అభినందించారు.



విజయం సాధించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు